క్లుప్తంగా

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.1.11 లక్షల విరాళం



సూపరింటెండెంట్‌కు చెక్ అందిస్తున్న దాత శివరావు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి నగరంలోని మహారాణిపేటకు చెందిన బి.శివరావు అనే దాత రూ.లక్ష 11వేల 116 విరాళాన్ని చెక్కు రూపంలో ఇచ్చారు. సింహగిరిపై పీఆర్వో కార్యాలయంలో ప్రొటోకాల్ సూపరింటెండెంట్ విక్రమ్‌కు అందించారు. దేవస్థానం తరపున దాతకు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రంను అధికారులు అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సింహాచలం: అడవివరం ఫీడర్ నిర్వహణ పనుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ జోన్-3 ఈఈ పి.శ్రీనివాసరావు తెలిపారు. దీంతో అడవివరం, భైరవవాక తదితర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా ఉండబోదన్నారు.

ప్రజల సహకారంతో నేరాల నియంత్రణ



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డీఎస్పీ విష్ణుస్వరూప్

పరవాడ: పోలీసులకు ప్రజలు సహకరించడం ద్వారా నేరాలను అరికట్టడడం సాధ్యపడుతుందని పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్ అన్నారు. స్థానిక జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీలో శుక్రవారం రాత్రి కాలనీ వాసులకు నేరాల నియంత్రణపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. అనుమానాస్పద వ్యక్తులు తారసపడిన వెంటనే పోలీసులకు సమాచారం అందజేయాలన్నారు. రాత్రి వేళ షిఫ్ట్ డ్యూటీలకు వెళ్లే కార్మికులు, ఉద్యోగులు తమ ఇళ్లకు తాళాలు వేసుకుని, సీక్రెట్ స్థలంలో తాళాలను భద్రపర్చుకోవాలన్నారు. నేరాలను అదుపు చేసే క్రమంలో కాలనీలో మూడు సీసీ కెమెరాలను అమర్చినట్లు తెలిపారు. త్వరలో మరికొన్ని కెమెరాలను ఏర్పాటు చేస్తామన్నారు. నేర నియంత్రణకు కాలనీ ప్రజల నుంచి స్పందన లభించడం ఆనందంగా ఉందన్నారు. సదస్సులో పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు, ఎస్‌ఐ బి.కృష్ణారావు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లుపై హర్షం



ఎస్సీ వర్గీకరణపై హర్షం వ్యక్తం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

సబ్బవరం: రాష్ట్రంలో విద్య, వైద్య, ఉద్యోగ నియామకాల్లో ఎస్సీ వర్గీకరణ అమలు చేసేందుకు ఆర్డినెన్స్ జారీచేసి గవర్నర్ ఆమోదం పొందిన ఈ బిల్లును న్యాయశాఖకు పంపడం పట్ల మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి అనకాపల్లి జిల్లా మాజీ అధ్యక్షుడు గొటివాడ సామ్రాట్‌కుమార్ హర్షం వ్యక్తం చేశారు. వర్గీకరణ విజయోత్సవ సంబరాలకు జిల్లా ముఖ్య నాయకులతో కలిసి ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పద్మశ్రీ మందకృష్ణ మాదిగ 30 ఏళ్ల పోరాటంతో మాదిగలు, ఇతర ఉపకులాలకు జనాభా దామాషా ప్రకారం ప్రయోజనం చేకూరే రోజులు మొదలయ్యాయని సంతోషం వ్యక్తం చేశారు.

అంబేడ్కర్ విగ్రహం తొలగింపు ఆదేశాలపై ఆగ్రహం

పెందుర్తి: చినముషిడివాడ సమీపంలోని ఆక్సిజన్ డిఫెన్స్ కాలనీలో ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని తొలగించాలని ఆర్డీవో శ్రీలేఖ కాలనీ వాసులకు సూచించడంపై సీపీఎం ఆగ్రహం వ్యక్తం చేసింది. బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహాన్ని తొలగించాలని కాలనీవాసులపై ఒత్తిడి తెచ్చిన ఆమెపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సీపీఎం గోపాలపట్నం డివిజన్ జోన్ కమిటీ కార్యదర్శి బి.జగన్ డిమాండ్ చేశారు. ఆర్డీవో చర్యను తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు.

24న మెగా జాబ్‌మేళా

గోపాలపట్నం: ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 24న నిర్వహించనున్న మెగా జాబ్ మేళా పోస్టర్‌ను ప్రభుత్వ విప్ గణబాబు శుక్రవారం గోపాలపట్నం క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ, గోపాలపట్నం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జరగనున్న ఈ మెగా జాబ్ మేళాలో పలు ప్రముఖ ఐటీ కంపెనీలు, ఫార్మాస్యూటికల్ కంపెనీలు, మార్కెటింగ్, ట్రాన్స్‌పోర్ట్, హాస్పిటల్ రంగానికి చెందిన దాదాపు 53 కంపెనీలు పాల్గొంటాయని తెలిపారు.

అటు ఇటు కాని.. ఆటో బతుకులు

గత ప్రభుత్వంలో ఏటా రూ.10 వేల ఆసరా

అమలుకు నోచని రూ.15 వేల కూటమి హామీ

పెరిగిన జరిమానాలు, ఆర్టీఏ, పోలీస్ దాడులు

సంక్షేమ బోర్డు ఊసెత్తని కూటమి ప్రభుత్వం





వాడచీపురుపల్లిలో ఆటో స్టాండ్‌లో నిలిపిన ఆటోలు

పరవాడ: కూటమి ప్రభుత్వం ఆటో కార్మికులను నిర్లక్ష్యం చేస్తోంది. దీంతో ఆటోలపై ఆధారపడి జీవిస్తున్న వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఎన్నికల సమయంలో డీజిల్, పెట్రోల్ ధరలను తగ్గించడంతో పాటు ఏడాదికి రూ.15 వేలు అందిస్తామని హామీలు గుప్పించారు. అధికారం దక్కించుకున్నాక ఆ హామీల అమలుపై కనీస ధ్యాస కూడా పెట్టని పరిస్థితి. దీనికి తోడు కొత్త జీవోలతో భారీ అపరాధ రుసుములు, కఠిన ఆంక్షలతో తమ బతుకుల్ని మరింత భారంగా మార్చుతున్నారని ఆటో కార్మికులు ఆవేదన చెందుతున్నారు.



ప్రయాణికులను ఎక్కించుకుంటున్న ఆటోవాలా

గ్రామీణ ప్రాంతాలకు ఆటోలే దిక్కు

మండలంలోని పరవాడ, వెన్నలపాలెం జంక్షన్, మండల కాంప్లెక్స్ కూడలి, వాడచీపురుపల్లి, దీపాంజలినగర్, ఊటగెడ్డ జంక్షన్, లంకెలపాలెం, సాలాపువానిపాలెం, ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం, దేశపాత్రునిపాలెం, ఫార్మాసిటీ కాలనీ, తానాం ప్రాంతాల్లో సుమారు 560 ఆటోలు ఉన్నాయి. ఆర్టీసీ బస్సులు అందుబాటులో లేని సమయంలో ప్రయాణికులకు ఆటోలే దిక్కు. ఆర్టీసీ బస్సు సదుపాయం అంతంత మాత్రంగా ఉన్న ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం ప్రజలకు ఆటోలు తప్ప మరో మార్గం లేదు. గ్రామీణ ప్రాంత ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చడంలో ముఖ్య పాత్ర పోషిస్తున్న ఆటో యజమానులకు దక్కేది అరకొర ఆదాయం మాత్రమే. రోజంతా ఆటో నడిపితే ఖర్చులన్నీ పోనూ మిగిలే దాంతో.. కుటుంబాలను పోషించుకోవడం భారంగా మారిందని వాపోతున్నారు.

పెరిగిన ట్యాక్స్‌లు, జరిమానాలు

కేంద్ర ప్రభుత్వం అపరాధ రుసుముల సవరణ పేరిట విడుదల చేసిన ఉత్తర్వులతో ఆటో డ్రైవర్లు బెంబేలెత్తుతున్నారు. దీని అమలు విచక్షణను రాష్ట్ర ప్రభుత్వాలకే అప్పగించినా.. మన రాష్ట్రంలో మాత్రం ఆర్టీఏ, పోలీస్ శాఖలకు ప్రత్యేక ఆదేశాల పేరిట తనిఖీలు ముమ్మరం చేశారు. భారీ అపరాధ రుసుములు విధిస్తున్నారని ఆటోడ్రైవర్లు ఆక్షేపిస్తున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుకు ముందుకు రాని ప్రభుత్వం, తమపై భారాలు వేయడంలో మాత్రం వెనుకంజవేయట్లేదని చెప్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన నుంచి ట్యాక్స్‌లు విపరీతంగా పెంచడమే కాకుండా డీజిల్, పెట్రోల్ ధరలూ భారంగా మారాయి. రవాణా శాఖ అధికారులు చీటికీమాటికీ రాంగ్ పార్కింగ్, సిగ్నల్ జంపింగ్ పేరిట అధిక జరిమానాలు విధిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆటోలను నమ్ముకుని జీవనం సాగించడం కష్టంగా ఉందని పలువురు ఆటో కార్మికులు వాపోతున్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మేలు



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే ఇచ్చిన హామీ మేరకు ఏటా రూ.10 వేలు ఆటో కార్మికుని బ్యాంకు ఖాతాల్లో జమ చేసేది. ప్రమాదవశాత్తూ ఆటో కార్మికుడు మరణిస్తే ప్రమాద బీమా వర్తింపజేసి, వారి కుటుంబాలకు అండగా నిలిచేది. ప్రస్తుత ప్రభుత్వం ఆటో కార్మికుల కష్టాలను పట్టించుకోవడం లేదు. పెరిగిన నిత్యావసర ధరలతో కుటుంబాలను నెట్టుకు రావడం కష్టంగా ఉంది.

– కిలపర్తి అప్పలనాయుడు, ఆటో కార్మికుడు, వాడచీపురుపల్లి

ఫైనాన్స్ కిస్తీలు చెల్లించలేక..



ఆయిల్ ధరలతోపాటు నిర్వహణ ఖర్చులు పెరిగిన నేపథ్యంలో రోజంతా కష్టపడి ఆటో నడిపితే ఖర్చులు పోనూ.. మిగిలేది రెండు మూడొందలు మాత్రమే. ఆటో కొనుగోలుకు తీసుకున్న ఫైనాన్స్‌కు నెలవారీ కిస్తీలు కట్టలేక సతమతమవుతున్నాం. ఏటా ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల భారం అదనం. రవాణా, పోలీస్ అధికారుల తనిఖీలు, జరిమానాలతో తలకు మించిన భారమవుతోంది.

– మైలపల్లి అప్పారావు, ఆటో కార్మికుడు, ముత్యాలమ్మపాలెం

హామీలు అమలు చేయాలి



పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలతో పాటు నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటాయి. రోజంతా కష్టపడి ఆటో నడిపితే వచ్చే అరకొర ఆదాయంతో కుటుంబ పోషణ కష్టంగా మారింది. అప్పులు చేసి కొనుగోలు చేసిన ఆటో రుణాలు, పెరిగిన ట్యాక్సులు చెల్లించలేక సతమతమవుతున్నాం. ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలుచేసి ఆటో కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలి.

– చుక్క వేణుగోపాల్, ఆటో యూనియన్ అధ్యక్షుడు

ఆటో కార్మికులను ఆదుకోవాలి



కష్టాల్లో ఉన్న ఆటో కార్మికులను ప్రభుత్వమే ఆదుకోవాలి. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలి. మోటారు రంగంపై మోపిన టాక్స్‌ల భారం తగ్గించాలి. ఏదో వంకతో ఆటో, ట్యాక్సీలపై చీటికీ మాటికీ జరిమానాలు విధించడం అన్యాయం. ఇప్పటికే ప్రభుత్వం పెంచిన ట్యాక్స్‌లు చెల్లించలేక, ఆటోలను నడపలేక అమ్ముకోవాలని చూస్తున్నారు. పెంచిన డీజిల్, పెట్రోల్ ధరలు తగ్గించాలి.

– గనిశెట్టి సత్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు, సీఐటీయూ

కనకమహాలక్ష్మి దేవస్థానానికి సింహాచలం ఏఈవో బదిలీ

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో ఏఈవోగా విధులు నిర్వర్తిస్తున్న కె.రాజేంద్రకుమార్‌ని నగరంలోని కనకమహాలక్ష్మి దేవస్థానానికి తిరిగి పంపిస్తూ రాష్ట్ర దేవదాయశాఖ ఇన్‌చార్జి కమిషనర్ కె.రామచంద్రమోహన్ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. చందనోత్సవం ముందు ఈ వ్యవహారం జరగడం దేవస్థానంలో చర్చకు దారితీసింది. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో ఏఈవోగా విధులు నిర్వర్తిస్తున్న రాజేంద్రకుమార్‌ను మూడేళ్ల క్రితం జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా విజయవాడ దేవస్థానానికి బదిలీ చేశారు. కొన్నిరోజులకు మెడికల్ పర్పస్‌పై రాజేంద్రకుమార్ నగరంలోని కనకమహాలక్ష్మి దేవస్థానానికి డిప్యుటేషన్‌పై వచ్చారు. మళ్లీ కొన్ని రోజులకు రాజేంద్రకుమార్ వర్క్ ఎరేంజ్‌మెంట్ బేస్‌లో కనకమహాలక్ష్మి దేవస్థానం నుంచి సింహాచలం దేవస్థానానికి వచ్చారు. దీంతో రాజేంద్రకుమార్‌ని తిరిగి కనకమహాలక్ష్మి దేవస్థానానికి ఏఈవోగా పంపిస్తూ ఇన్‌చార్జి కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా చందనోత్సవం ముందు ఈవ్యవహారం జరగడం దేవస్థానం వర్గాల్లో చర్చకు దారితీసింది. ఏఈవోగా విధులు నిర్వర్తిస్తున్న రాజేంద్రకుమార్ భూపరిరక్షణ విభాగం బాధ్యతలు కూడా నిర్వర్తిస్తున్నారు. భూముల వ్యవహారంలో ఆయన పనితీరుతో అనుసరిస్తున్న వ్యవహారశైలి కూడా బదిలీకి ఒక కారణంగా చెప్పుకుంటున్నారు.

పెట్రోల్ బంకుల్లో అగ్ని ప్రమాదాలపై అవగాహన



ఇరువాడ పెట్రోల్ బంక్‌లో సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక అధికారులు

సబ్బవరం: పెట్రోల్ బంక్‌లలో జరిగే అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా వ్యవహరించకపోతే తీవ్ర పరిణామాలు సంభవించే అవకాశం ఉందని సబ్బవరం అగ్నిమాపక అధికారి జీవీ సత్యరాజు హెచ్చరించారు. స్థానిక సత్యసాయి ఎంటర్‌ప్రైజెస్, బీపీసీఎల్ పెట్రోలియం ఫిల్లింగ్ స్టేషన్, ఇరువాడలోని పెట్రోల్ బంక్‌లలో అగ్నిప్రమాదాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బంకులలో పనిచేస్తున్న సిబ్బందికి, వాహన చోదకులకు పెట్రోల్ బంక్‌లలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. కార్యక్రమంలో లీడింగ్ ఫైర్‌మన్ పి.శివప్రసాద్, ఫైర్‌మన్ కె.మహేశ్వరరావు, సిబ్బంది పి.అప్పారావు, బి.ఉదయ్‌కుమార్, ఎం.సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఫార్మా పరిశ్రమల్లో ప్రమాదాల నియంత్రణకు పటిష్ట చర్యలు



సమావేశంలో ప్రసంగిస్తున్న అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా, పాల్గొన్న ఫార్మా యాజమాన్య ప్రతినిధులు

- ఔషధ పరిశ్రమల ప్రతినిధుల సమీక్షా సమావేశంలో కలెక్టర్ విజయ కృష్ణన్ సూచన

పరవాడ: ఔషధపరిశ్రమల్లో భవిష్యత్‌లో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా యాజమాన్యాలు పటిష్ట చర్యలు తీసుకోవాలని అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ సూచించారు. స్థానిక ఎకోనో హోటల్‌లో పరిశ్రమల్లో జరిగే ప్రమాదాల నివారణ, భద్రతా చర్యలపై పరవాడ, అచ్యుతాపురం, రాంబిల్లి ప్రాంతాల్లోని పరిశ్రమలకు చెందిన చైర్మన్‌లు, మేనేజింగ్ డైరెక్టర్లు, డైరెక్టర్లు, ప్లాంట్ నిర్వహణ అధికారులు, భద్రతాధికారులు, హెచ్‌ఆర్ మేనేజర్లతో శుక్రవారం ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆమె ప్రసంగించారు. ఫార్మా పరిశ్రమల్లో ప్రమాదాల నివారణ కోసం కార్మికులకు ప్రత్యేక శిక్షణ అందించాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో సమర్థవంతంగా పనిచేసే వ్యవస్థను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ పరిశ్రమలు జిల్లా అభివృద్ధికి, ఉపాధి అవకాశాలకు దోహదపడాలన్నారు. ప్రమాదాల సమయంలో సమయస్ఫూర్తితో స్పందించడం ద్వారా ప్రాణ, ఆస్తి నష్టాలను తగ్గించవచ్చన్నారు. సంబంధిత శాఖల మధ్య సమన్వయం ఎంతో అవసరమని సూచించారు. భవిష్యత్‌లో ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు అవసరమైన సూచనలను పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్ సూచనలు చేశారు. సమావేశంలో ఫ్యాక్టరీస్ జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ జె.శివశంకర్‌రెడ్డి, బాయిలర్ ఇన్‌స్పెక్టర్ కె.వీరభద్రరావు, పీసీబీ ఈఈ పి.వి.ముకుందరావు, జిల్లా అగ్నిమాపక అధికారి ఆర్.వి.రమణ, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ వి.అభిప్రియ, లేబర్ డిపార్ట్‌మెంట్ అధికారి కె.వసంతరావు, పరవాడ, అచ్యుతాపురం, రాంబిల్లి సీఐలు ఆర్.మల్లికార్జునరావు, ఎన్.గణేష్, సీహెచ్ నరసింహరావు, ఎస్‌ఐలు కృష్ణారావు, రామారావు, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

‘చందనోత్సవానికి బస్సులన్నీ కండిషన్‌లో ఉండాలి’



డిపో సిబ్బందికి సూచనలిస్తున్న ఈడీ బ్రహ్మానందరెడ్డి

సింహాచలం: ఈ నెల 30న జరగనున్న శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి చందనోత్సవానికి సింహాచలం డిపో నుంచి తిరిగే బస్సులన్నీ పటిష్ట కండిషన్‌లో ఉండాలని ఆర్టీసీ విజయనగరం జోన్ ఈడీ కె.ఎస్.బ్రహ్మానందరెడ్డి డిపో అధికారులను ఆదేశించారు. సింహాచలం డిపోను శనివారం సందర్శించిన ఆయన గ్యారేజీలో ఉన్న బస్సులను తనిఖీ చేశారు. చందనోత్సవాన్ని పురస్కరించుకుని సింహాచలం డిపో 50 బస్సులను నడపనున్నట్లు తెలిపారు. వీటిలో 35 బస్సులు కొండదిగువ గోశాల నుంచి సింహగిరిపైకి, 15 బస్సులు పాత అడవివరం నుంచి కొత్త టోల్‌గేట్ మీదుగా నడుస్తాయన్నారు. ప్రయాణికులకు అసౌకర్యం లేకుండా బస్సుల ఫిట్‌నెస్ సరిపై చేయాలని సూచించారు. ఆయన వెంట విశాఖ ఆర్‌ఎమ్ బి.అప్పలనాయుడు, డిపో మేనేజర్ రాజశేఖర్, అసిస్టెంట్ ఇంజినీర్లు నాయుడు, కొండలరావు, సూపర్‌వైజర్లు, గ్యారేజీ సిబ్బంది, డ్రైవర్లు, కండక్టర్లు పాల్గొన్నారు.

వసతి గృహ బాలికలకు బ్యాగులు, వాటర్ బాటిళ్ల పంపిణీ



వసతిగృహ విద్యార్థినులకు వాటర్ బాటిళ్లను అందిస్తున్న ఎన్టీపీసీ హెచ్‌ఆర్ బీబీ పాత్ర

పరవాడ: విద్యార్థి దశలో చదువుపై శ్రద్ధ వహించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సింహాద్రి ఎన్టీపీసీ హెచ్‌వో హెచ్‌ఆర్ బి.బి.పాత్ర ఆకాంక్షించారు. సంస్థ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నాయుడుపాలెం శివారు మెట్టపాలెం బాలికల వసతి గృహ విద్యార్థులకు ఎన్టీపీసీ సీఎస్సార్ నిధులతో సమకూర్చిన స్కూల్ బ్యాగ్‌లు, వాటర్ బాటిళ్లను శుక్రవారం అందించారు. ఎన్టీపీసీ డీజీఎం హెచ్‌ఆర్ అనిత మాట్లాడుతూ చదువు గౌరవాన్ని పెంచుతుందన్నారు. కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితేనే విజయం సాధించగలరని పేర్కొన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు జి.చంద్రశేఖర్ మాట్లాడుతూ వసతి గృహ విద్యార్థులకు బ్యాగులు, వాటర్ బాటిళ్లను పంపిణీ చేసిన ఎన్టీపీసీ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఆజ్మీర వెంకటేశ్వరరావు, ప్రతినిధులు గుంటూరు శ్రీనివాస్, జి.సుధాకర్, టి.రాజలింగం, కె.నారాయణరావు, తాతాబాబు, చిట్టిబాబు, ప్రసాద్, మహేష్, చినబ్బాయి, ఆదయ్య, సంస్థ అధికారులు పాల్గొన్నారు.

బాలికల సాధికారత మిషన్ బేస్‌లైన్ సర్వే



బేస్‌లైన్ సర్వేకు హాజరైన విద్యార్థినులతో ఎన్టీపీసీ సీఎస్సార్ బృందం

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ ఆధ్వర్యంలో తన్వి కన్సల్టెన్సీ సహకారంతో దీపాంజలినగర్ బాలభారతి పబ్లిక్ స్కూల్లో బాలికల సాధికారత మిషన్(జీఈఎం-25) బేస్‌లైన్ సర్వేను శుక్రవారం నిర్వహించారు. మండలంలోని 28 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన యువతుల సాధికారత కోసం ఈ సర్వే చేపట్టారు. వివిధ ప్రభుత్వ పాఠశాలల నుంచి 115 మంది విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యాపరమైన సుసంపన్నత, సమగ్రాభివృద్ధిపై దృష్టి సారించి, 4 వారాల రెసిడెన్షియల్ వర్క్ షాప్ ప్రారంభించారు. విద్యార్థినుల తల్లిదండ్రులతో సంస్థ సీఎస్సార్ బృందం సమావేశమై జీఈఎం లక్ష్యాలు, ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. రెసిడెన్షియల్ వర్క్‌షాప్‌లో పాల్గొన్న విద్యార్థినులకు అవసరమైన బూట్లు, యూనిఫాం కొలతలు, నిత్యావసర వస్తువుల వివరాలను సేకరించారు.

టీడీపీ కార్యాలయం ప్రారంభం

పరవాడ: పెందుర్తి టీడీపీ ఇన్‌చార్జ్ గండి బాబ్జీ ఆధ్వర్యంలో గొర్లివానిపాలెంలో ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయాన్ని విశాఖ ఎంపీ మతుకుమిల్లి శ్రీభరత్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమిలో చిన్నచిన్న పొరపాట్లున్నా.. స్థానిక ఎమ్మెల్యేతో సఖ్యతగా ఉండి కార్యకర్తలకు అవసరమైన పనులు చేయించుకోవాలన్నారు. బాబ్జీ మాట్లాడుతూ నియోజకవర్గంలో కార్యకర్తలకు అండగా ఉంటూ వారి కష్టసుఖాల్లో పాలు పంచుకుంటానన్నారు. పార్టీ నాయకులు పైల జగన్నాథరావు, మాసవరపు అప్పలనాయుడు, వియ్యపు చిన్న, రెడ్డి నారాయణరావు, కాళ్ల వరలక్ష్మి, కన్నూరు దేవి వెంకటరమణ, గొర్లి కనకారావు, గొర్లి శ్రీనివాసరావు, కె.శ్రీరామ్మూర్తి, ఇందల కొండలరావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

బాణసంచా తయారీ కేంద్రాల్లో తనిఖీలు



అంతకాపల్లిలో బాణసంచా తయారీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న అధికారుల బృందం

సబ్బవరం: అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం కైలాసపట్నంలోని బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన దుర్ఘటన నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు ఏడుగురు అధికారుల బృందం మండలంలోని బాణసంచా తయారీ కేంద్రాల్లో శుక్రవారం తనిఖీలు చేపట్టింది. ఈ బృందంలో తహసీల్దార్ బి.చిన్నికృష్ణ, ఫైర్ అఫీసర్ సత్యరాజు, సీఐ పిన్నింటి రమణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హరిణి, ఈవోపీఆర్డీ విష్ణుమూర్తి, లేబర్ అఫీసర్ పి.సూర్యనారాయణ, లీగల్ మెట్రాలజీ అధికారి ఆర్.ధనుంజయ్‌లు ఉన్నారు. వీరంతా శాఖల వారీగా బాణసంచా తయారీ కేంద్రాల్లో నిబంధనల మేరకు అణువణువూ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలోని గుల్లేపల్లి, మల్లునాయుడుపాలెం, రావలమ్మపాలెం, జీవీఎంసీ పరిధి గంగవరం గ్రామాల్లో పర్యటించి, బాణసంచా తయారీ కేంద్రాలను పరిశీలించినట్లు పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్‌కు దీనిపై శనివారం పూర్తిస్థాయి నివేదికను అందించనున్నట్లు వెల్లడించారు.

జనాభా ప్రాతిపదికన వర్గీకరణ ఫలాలు అందాలి



ఎమ్మార్పీఎస్ నాయకుడు ఐడిబాబు

సబ్బవరం: ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణలో రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ చేసిన రోస్టర్ పాయింట్ల విధానాన్ని ఎమ్మార్పీఎస్ నాయకుడు ఐడిబాబు శుక్రవారం ఓ ప్రకటనలో తప్పుబట్టారు. ఎస్సీలో అత్యంత వెనుకబడిన కులాలవారికి తగు ప్రాధాన్యత ఇవ్వలేదన్నారు. సుప్రీం కోర్టు తీర్పునకు విరుద్ధంగా కమిషన్ నివేదిక ఉందని ఆక్షేపించారు. రాష్ట్ర ప్రభుత్వానికి కమిషన్ అందించిన నివేదికను బహిర్గతం చేసి రెల్లి అనుబంధ కులాలవారికి 1 శాతం, మాదిగ అనుబంధ కులాలకు 7 శాతం, మాల అనుబంధ కులాలకు 7 శాతం వచ్చేలా సవరించాలని సూచించారు. 2011 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్ర యూనిట్‌గా ఏబీసీడీ వర్గీకరణ చేశారని, తిరిగి 2026లో జిల్లా యూనిట్‌గా వర్గీకరణ ఫలాలు అందిస్తామంటున్నారని పేర్కొన్నారు. జనాభా ప్రాతిపదికన రాష్ట్ర యూనిట్‌గా వర్గీకరణ ఫలాలు అందించాలన్నారు. ప్రభుత్వం వర్గీకరణను సవరించకపోతే మాదిగల న్యాయం కోసం హైకోర్టు మెట్లు ఎక్కాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ ఆర్డినెన్స్ సాధన వెనుక ఎంతో మంది ఎమ్మార్పీఎస్ కార్యకర్తల బలిదానాలు ఉన్నాయన్నారు. మందకృష్ణ మాదిగ తెలంగాణాలో ఒకలా, ఆంధ్రాలో మరోలా వ్యవహరిస్తున్న వైఖరి చూస్తుంటే.. చంద్రబాబుకు దండోరా తాకట్టుపెట్టారనే అనుమానం కలుగుతోందన్నారు.